స్కెచ్

# స్వార్థత్యాగి

"సులోచన"

కనకారావు కొత్తగా ఉద్యోగంలో ప్రవేశించాడు. అతనికి "చాలా మంచివాడు" అన్న బిరుదు పుట్టిపెరిగిన వూళ్ళో రావటానికి ముఖ్య కారణం అతనిలోవున్న అమాయకత్వం. ఎటువంటి పరిస్థితుల్లో ఎవ్వరికీ అపకారం చేయకండా వుండటమే.

ఉద్యోగంలో ప్రవేశించిన రోజునే మేనేజరు కనకారావును ప్రత్యేకంగా పిలిపించి, తన మామూలు వాగ్ధోరణిలో యిలా అన్నాడు:

"నీవు చేసేపని చక్కగా, ఒకళ్లకు అదర్శంగా ఉండాలి. మేము చెప్పిన ప్రకారం నడుచుకోవటం నీ ముఖ్య కర్తవ్యం. నీ ఉద్యోగ ధర్మం కూడా అదేను. ఈ ఆఫీసుకు నేను చక్రవర్తి అంతటి వాణ్ణని నీవు క్షణక్షణం ఆఫీసులో ఉన్నంతకాలమూ గుర్తుంచుకొని పని చేయటం ఎంతయినా అవసరం. ఏది చేయా అన్నా నా చేతులో పని. అధికారమంతా నాదే!"

కనకారావు జాగ్రత్తగా విన్నాడు. మనస్సులో రెండు మూడుసార్లు మననం చేసుకున్నాడు.

కాని, రెండు వారాలు గడిచేప్పటికి కనకారావు చేసేపని మేనేజరుకు సుతరామూ నచ్చలేదు. ఆఫీసులో పగలు కన్నుమూయటం ఆయన చూశాడు. చేస్తున్న పని ఆపి ప్రక్క ఉద్యోగస్తులతో సినిమా విశేషాలు చెప్పటం కూడా ఆయన చూడటం జరిగింది.

వెంటనే మేనేజరు కనకారావును ఉన్నట్టు పిలిపించి అధికారస్వరం ధ్వనించేట్టు యిలా అన్నాడు:

"నీ పని మాకేమీ నచ్చలేదు. ఇదిగో అబ్బాయి! ఇల్లా ఇంకో వారం రోజులు చేశావంటే ఆపైన నీ జీతంలో కొంత భాగం మినహాయించడమో, నిన్ను ఉద్యోగంనుంచి తొలగించడమో జరుగుతుంది. అంతా నా చేతులోపని. జాగ్రత్త!"

కనకారావు ఆ మాటలకు వొణికిపోయాడు. అసలే తనది బీద సంసారం. మనస్సును కట్టుదిట్టం చేసుకున్నాడు. ప్రక్కవాళ్ళ వంక కన్నెత్తి చూడటం మానేశాడు

మరి రెండు వారాలు గడిచాయి.

కనకారావు విసుగూ విరామం లేకుండా, సెలవు దినాల్లో కూడా, ఆఫీసు టైము తరువాత కూడా పనిచేసి, మేనేజరు మెప్పును సంపూర్తిగా పొందాడు. అప్పుడు మేనేజరు తక్కిన ఉద్యోగస్థులతో యిలా అన్నాడు:

"కనకారావును చూచి నేర్చుకోండి అతనికి ఆఫీసు పనిపట్ల వున్న ఆసక్తిలో మీకు నాలుగోవంతువున్నా బాగుపడిపోదురు."

తక్కిన ఉద్యోగస్థులు ఒకందుకు భయపడ్డారు. తమకంటె వెనుక వచ్చిన కనకారావు మేనేజరు మెప్పును పొందాడు. రేపు తమ కన్న పెద్ద ఉద్యోగంలోకి మేనేజరు చేత పంపించబడతాడేమో!

నెలాఖరులో కనకారావుకు మామూలు జీతమే వచ్చింది. రెండో నెల కూడా అంతే!

ఉండబట్టలేక కనకారావు మేనేజరును అడిగాడు: "బీదవాణ్ణి. మిమ్మల్ని నమ్ముకొని మీ మెప్పుకోసం కష్టించి పనిచేస్తున్నాను."

మేనేజరు అర్థం చేసుకున్నాడు. గంభీరంగా యిలా అన్నాడు:

"అయితే నీవు ఆఫీసు క్షేమం, అభివృద్ధి కోసం పనిచేయడం లేదన్నమాట. స్వార్థాన్ని కోరుతున్నావన్నమాట. అలాగైతే యిటువంటి స్వార్థపరులు మా ఆఫీసులో ఉండడం మాకే ప్రమాదం. జాగ్రత్త! అంతా నా చేతులో పని."